రామ రామ రామ ఉయ్యాలో..





పెద్దపల్లిలో..

కాల్వశ్రీరాంపూర్‌లో..

సుల్తానాబాద్‌లో..

పెద్దపల్లిలో బతుకమ్మతో చిన్నారి

పెద్దపల్లి, న్యూస్‌టుడే బృందం: జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు కనుల పండువగా జరిగాయి. మహిళలు రంగు రంగుల పువ్వులతో అందమైన బతుకమ్మలను పేర్చారు. కొందరు నిలువెత్తు బతుకమ్మలను తయారు చేయగా.. మరికొందరు బతుకమ్మలపై దేవతా మూర్తులను ప్రతిష్ఠించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్‌బండ్‌పై ప్రధాన కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకలను ఎమ్మెల్యే విజయరమణారావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మమతరెడ్డిలు పర్యవేక్షించారు. సీఐలు ప్రవీణ్‌కుమార్, అనిల్‌కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు.



మంథని: పెంజేర్లకట్టలో



ధర్మారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెద్దపల్లి : గునుగుపూలతో



ఖనిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఖని మార్కండేయ కాలనీలో..



పెద్దపల్లిలో మినీ ట్యాంక్‌బండ్‌పై..

పీజీ కోర్సుల మంజూరుకు సన్నాహాలు

పురోగతిలో 'ఖని' ప్రభుత్వ వైద్య కళాశాల

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం



గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల

సింగరేణి సంపూర్ణ సహకారంతో గోదావరిఖనిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం మెడికల్ హబ్‌గా మారింది. 2022 ఆగస్టు 25న ఖనిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్య కమిషన్ అనుమతి ఇవ్వడంతో.. అదే ఏడాదిలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సర ప్రవేశాలు చేపట్టారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ మూడో బ్యాచ్ ప్రవేశాలు సైతం దాదాపుగా పూర్తయ్యాయి. ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ఫలితాలతో తరగతుల నిర్వహణ గాడిన పడడంతో తాజాగా పీజీ కోర్సుల మంజూరుకు ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. 50 సీట్ల సామర్థ్యంతో నర్సింగ్ కళాశాల నిర్వహణకు అనుమతి లభించింది.

వైద్య విద్యలో మరో ముందడుగు

పీజీ కోర్సులు మంజూరైతే రామగుండం ప్రాంతంలో వైద్య విద్యలో మరో ముందడుగు పడనుంది. సింగరేణి సహకారంతో సుమారుగా రూ.542 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాలతోపాటు వసతి గృహాలు, ఇతర భవనాల నిర్మాణాలు చేపట్టగా అందులో వైద్య విద్య పీజీ కోర్సులకు సంబంధించి విద్యార్థుల వసతి గృహాలు, లెక్చర్ హాల్స్ నిర్మాణాలు సైతం చేపట్టారు. దీంతో పీజీ కోర్సులు మంజూరైనా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరముండదు.

50 సీట్లతో నర్సింగ్ కళాశాల

సాధారణంగా వైద్య కళాశాల ఏర్పాటుతో దానికి అనుబంధంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తుంటారు. దీనిలో భాగంగానే గోదావరిఖనిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతోపాటు ప్రత్యేక భవన నిర్మాణానికి స్థలాన్ని సైతం కేటాయించారు. భవన నిర్మాణంలో జాప్యం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాల భవన సముదాయంలో విశాలమైన వసతులు ఉండటంతో.. నర్సింగ్ కళాశాలనూ అందులోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటగా బీఎస్సీ(నర్సింగ్)లో 50 సీట్లతో నర్సింగ్ కళాశాల నిర్వహించనుండగా.. ఆ తర్వాత ఎంఎస్సీ(నర్సింగ్)నకు సైతం అనుమతులు లభించే అవకాశముంది.

ప్రతిపాదనలు పంపాం..

గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ కోర్సుల అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం. కోర్సుల నిర్వహణకు అన్నిరకాల సదుపాయాలతోపాటు నిబంధనలు వర్తించనుండటంతో ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. అనుమతి లభిస్తుందనే ఆశాభావం ఉంది. నర్సింగ్‌లో 50 సీట్లతో ప్రవేశాలు మొదలుకానున్నాయి. ఎంబీబీఎస్ మూడో బ్యాచ్ ప్రవేశాలు దాదాపుగా పూర్తయ్యాయి.

- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

ఆరోగ్యానికి అండా



- రోజుకొకటి తింటే మేలు
- నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లాలో రోజుకు

గుడ్ల ఉత్పత్తి	వినియోగం	జాతీయ పోషకాహార మండలి సిఫార్సు ప్రకారం ప్రతి మనిషి సగటున ఏడాదికి తినాల్సిన గుడ్లు
50 లక్షలు	12 లక్షలు	180

గుడ్డు.. ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది. శరీరానికి సరిపడే సమతులాహారంగా మారుతోంది. అవసరమైన పోషకాలు అందిస్తూ రోగనిరోధక శక్తి పెరగడానికి దోహదపడుతుంది. నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వినియోగంపై కథనం..

ఒక గుడ్డులో..

- కేలరీలు- 80
- ప్రొటీన్లు- 6.30 గ్రాములు
- కార్బొహైడ్రేట్లు- 0.6 "
- మొత్తం కొవ్వు- 5 "
- కొలెస్ట్రాల్- 213 మిల్లీ గ్రాములు
- సోడియం- 63 "

ఇవి గమనించండి

- పౌల్ట్రీఫామ్‌లోని ఒక కోడి సంవత్సరానికి 305-310 గుడ్లను పెడుతుంది.
- కోడి జీవితకాలంలో 75-80 వారాలపాటు గుడ్లు పెట్టగలదు. హైబ్రిడ్‌వి 100 వారాలు పెడతాయి.
- నాటు కోడి మాత్రం ఏడాదికి 150-200 గుడ్లను మాత్రమే అందివ్వగలదు.
- రోజు రెండుకన్నా ఎక్కువ గుడ్లు తినేవారు కచ్చితంగా వ్యాయామం చేస్తే మంచిది.
- మోతాదుకు మించి తింటే జీర్ణాశయంపై ప్రభావం చూపి కడుపులో చికాకు కలిగిస్తుంది.
- లేయర్ కోడి గుడ్డు పరిమాణం 70-100 గ్రాములు, దేశవాళీ అయితే 30-60 గ్రాములుంటుంది.

బడుల్లో.. అంగన్‌వాడీ కేంద్రాల్లో..

- నాలుగు జిల్లాల పరిధిలో 1-10వ తరగతి చదివే ప్రభుత్వ విద్యాలయాల్లోని విద్యార్థులు దాదాపుగా 2 లక్షల మందికి వారానికి మూడుసార్లు ఈ కోడిగుడ్డు పౌష్టికాహారంగా అందివ్వాలి. అయితే మధ్యాహ్న భోజనానికి చెల్లిస్తున్న డబ్బులు సరిపోవడం లేదని కొన్నిచోట్ల నిర్వాహకులు వారానికోసారే ఇస్తున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో 1.80 లక్షల అంగన్‌వాడీ చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు కూడా గుడ్డు ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేవి పరిమాణం తక్కువగా ఉంటున్నాయనే ఆరోపణలుంటున్నాయి.

కొవ్వు పెరుగుతుందనుకోవడం అపోహనే..



గుడ్డులో పచ్చసొనతో కొవ్వు పెరుగుతుందనేది అపోహ మాత్రమే. అందులో డీ3 విటమిన్ ఉంటుంది. ఇది శరీరంలోని ఎముకల గట్టిదనానికి చాలా అవసరం. గుండె రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడకుండా నివారించే లెసిపెన్ అనే రసాయనం పచ్చసొనలో ఉంటుంది. చాలా మందిలో ఇటీవల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. పూర్తి గుడ్డు తింటే వీరికి మేలు కలుగుతుంది.

- డాక్టర్ మమత, పోషకాహార నిపుణులు, కరీంనగర్

పెరుగుతున్న వినియోగం



ఉమ్మడి జిల్లాలో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు తగినట్లుగా వినియోగం ఎక్కువగానే ఉంటోంది. రోజులో 50లక్షలకుపైగా గుడ్ల ఉత్పత్తి అవుతుండగా.. జిల్లాలో సరఫరాతోపాటు ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ఎగుమతి ఇటీవల పెరిగింది. కరోనా తరువాత ప్రజల్లో గుడ్డును తింటే మంచిదనే అభిప్రాయం పెరిగింది.

- గొంటి సంతోష్, పౌల్ట్రీ యజమాని, కరీంనగర్

త్వరలో మానేరుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం



బస్సులో టికెట్ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, న్యూస్‌టుడే: గ్రామీణ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. హుజూరాబాద్ నుంచి ఓదెల మండలంలోని పలు గ్రామాల మీదుగా సుల్తానాబాద్, కరీంనగర్ వరకు నడిచే బస్సును ఎమ్మెల్యే గురువారం రూపునారాయణపేటలో ప్రారంభించారు. నూతన బస్సులో టికెట్ తీసుకొని కొంత దూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ డిపో మేనేజరుతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించామన్నారు. దసరా తర్వాత రూపునారాయణపేట నుంచి జమ్మికుంట మండలం విలాసాగర్ మధ్య మానేరుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. రూపునారాయణపేట-గొల్లపల్లి మధ్యలో రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణానికి అధికారుల సర్వే పూర్తయిందని పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అనంతరం గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మెన్ సుమన్‌రెడ్డి, నాయకులు రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కోరుట్ల జట్టుతో ప్రభుత్వ విప్

వాలీబాల్ పోటీల విజేత కోరుట్ల

ధర్మారం, న్యూస్‌టుడే : మండలంలోని నందిమేడారంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కోరుట్ల జట్టు విజేతగా నిలిచింది. స్థానిక నందిని యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. తుది పోరులో నందిమేడారం జట్టుపై కోరుట్ల జట్టు గెలిచి విజేతగా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ బహుమతులు అందించారు. ఏఎంసీ ఛైర్మన్ రూప్లానాయక్, వైస్ ఛైర్మన్ లింగయ్య, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు రమణ, కోమల్, నందిని యూత్ క్లబ్ అధ్యక్షుడు వీర్‌పాల్ పాల్గొన్నారు.



హమాలీలకు బోనస్ చెక్కు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, అధికారులు

హమాలీలకు బోనస్ అందజేత

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పౌరసరఫరాల సంస్థ బియ్యం నిల్వల గోదాంలలో విధులు నిర్వహిస్తున్న హమాలీలకు అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ గురువారం దసరా బోనస్ పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.6,500 చెక్కు, రూ.800 విలువ చేసే తీపి పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేలం వేసేలోపు పనికొచ్చేలా లేవు!



తుప్పు పట్టిన ఆటోలు

అటవీ శాఖ అధికారులు వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలు వేలం పాట నిర్వహించక, యజమానులు తీసుకెళ్లక తుప్పుపట్టిపోతున్నాయి. వన్యప్రాణులను, వాటి మాంసాన్ని.. కలప రవాణాను చేసిన వాహనాలను, అటవీ భూమిని చదును చేసిన ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని మండలంలోని ఎగ్లాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఉంచారు. పట్టుకున్న వాహనాలను జరిమానా విధించి యజమానులు తీసుకెళ్లాలి. లేదా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటికి వేలం నిర్వహించాలి. కోర్టులో కేసులు నడుస్తుండటం వల్ల వాహనాలు వేలం వేయడం లేదని మంథని అటవీశాఖ క్షేత్రాధికారి రాథోడ్ రమేష్ చెప్పారు. **- న్యూస్‌టుడే, మంథని**

మంథనిలో నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని, న్యూస్‌టుడే: మంథనిలో శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు మండలంలోని అడవిసోమన్‌పల్లిలో 25 ఎకరాల స్థలంలో రూ.300 కోట్లతో నిర్మించనున్న సమీకృత గురుకుల పాఠశాల భవనానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మంథని నియోజకవర్గంలోని గీత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్‌లను మంత్రి పంపిణీ చేస్తారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబు వ్యక్తిగత సహాయకుడు ఒక ప్రకటన విడుదల చేశారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని పట్టణం : సమస్యలను అధిగమిస్తూ ముందుకు సాగితేనే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానసిక వైద్య విభాగం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దసరా ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక పరిశ్రమలు, ప్రభుత్వంలోని వివిధ శాఖల సమన్వయంతో దసరా ఉత్సవం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచించారు. నగరపాలక కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు. మేయర్ అనిల్‌కుమార్, జీఎం లలిత్‌కుమార్ అగ్నిమాపక, విద్యుత్తు, సింగరేణి, ఎన్టీపీసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వ్యవసాయాధార పనులకే పెద్దపీట



అప్పన్నపేట ఎస్సారెస్పీ కాలువలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

- వచ్చే ఏడాది ఉపాధిహామీ ప్రణాళికపై గ్రామసభలు

పల్లెల నుంచి వలసలు తగ్గించి, స్థానికంగా జీవనోపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపునకు గ్రామసభల్లో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశాలు రావడంతో జిల్లా యంత్రాంగం కార్యక్షేత్రంలోకి దిగింది. ప్రతి ఊరిలో కూలీలకు చేతి నిండా పని లభించేలా గ్రామసభల్లో ప్రణాళికలను ఆమోదించనున్నారు. గతంలో ఎదురైన సమస్యలు అధిగమిస్తేనే కూలీలకు ఉపాధి భద్రత దొరకనుంది.

150 రకాల పనుల ఎంపిక

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయాధార పనులకు ప్రాధాన్యమిచ్చారు. ఈ నిబంధన గతంలోనూ ఉన్నా ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఈసారి 60 శాతం వ్యవసాయాధార పనులు, 40 శాతం ఇతర పనులను ఎంపిక చేయాల్సి ఉంది. మొత్తం 266 పనుల్లో మేకలు, గొర్రెలు, పందుల షెడ్లు, పౌల్ట్రీ, నీటి కుంటలు, పంట కాలువలు, నీటి మళ్లింపు కుంటలు, బావులు, చెక్‌డ్యాంల పూడికతీత, భూ అభివృద్ధి పనులు.. ఇలా 150 రకాల పనులను ఎంపిక చేస్తున్నారు. గ్రామస్థులు, స్వశక్తి మహిళలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి ప్రణాళికను ఆమోదించనున్నారు.

జిల్లాలో ఉపాధిహామీ పథకం వివరాలు

- జాబ్‌కార్డులు : 1,19,380
- నమోదైన కూలీలు : 2,44,651
- యాక్టివ్ జాబ్‌కార్డులు : 74,489
- ఈ ఏడాది ఇప్పటివరకు వెచ్చించిన నిధులు : రూ.55.98 కోట్లు
- ప్రస్తుత సంవత్సరం పని దినాల లక్ష్యం: 22.52 లక్షలు
- కల్పించిన పని దినాలు: 21.77 లక్షలు

ఇవీ సమస్యలు

- చాలా చోట్ల పని చేసిన కూలీలకు నెలల తరబడి వేతనాలు అందక నిరీక్షించాల్సి వస్తోంది.
- వేతనాల చెల్లింపులో అక్రమాలకు తావు లేకుండా కేంద్రం నేరుగా కూలీల ఖాతాల్లోనే జమ చేస్తోంది. జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానంలో జాప్యంతో వేతనాలు జమ కావడం లేదు.
- కొన్ని చోట్ల పనులు చేయకున్నా చేసినట్లు నమోదు చేస్తున్న మేట్లు తమ బంధువులు, అనుచరుల పేరిట నిధులు కాజేస్తున్నారు.

పర్యవేక్షణ పెరిగితేనే మేలు

- పనులపై అధికారుల పర్యవేక్షణ పెరిగితే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది.
- చేసిన పనులకు కొలతలు తీసుకోవడంలో జాప్యం వీడి త్వరితగతిన ఎంబీ రికార్డులు పూర్తి చేయాలి.
- వేతన చెల్లింపుల్లో జాప్యంపై సాంకేతిక కారణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సవరించాలి.
- పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వసతులు కల్పించాలి.

ప్రజావసరాలకే పెద్దపీట

జిల్లాలో వచ్చే ఏడాది పని దినాల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్నాం. పనుల గుర్తింపులో ప్రజల అవసరాలకే పెద్దపీట వేస్తున్నాం. వ్యవసాయాధార పనులను ఎంపిక చేయాల్సి ఉంది. గత తప్పిదాలను అధిగమించేలా చర్యలు తీసుకుంటాం. కోరిన కూలీలందరికీ పని కల్పిస్తాం.

-రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

బంతి పూలు కిలో రూ.300

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ) : రామగిరి మండలం సెంటినరీకాలనీలో బంతి పూలకు ధర భారీగా పలికింది. బుధవారం కిలో రూ.100 ఉండగా గురువారం రూ.300కు చేరింది. బహిరంగ మార్కెట్‌కు సరిపడా పూలు రాకపోవడంతో ఒక్కసారిగా ధర పెరిగిందని వ్యాపారులు పేర్కొన్నారు. ధర పెరిగినా పండగ కావడంతో జనం కొనుగోలు చేశారు.

విహారం.. వినోదం.. వికాసం

కుటుంబ సభ్యులతో కలిసి పర్యటనలు ■ దసరా సెలవుల సద్వినియోగం



జీవితం పరుగులమయమైంది. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు పని ఒత్తిళ్లు.. ఆలోచనలు చుట్టుముట్టేస్తున్నాయి. పిల్లలైతే బడికి వెళ్లిరావడం.. హోంవర్క్ అంటూ రాత్రి వరకు మేల్కొని ఉంటున్నారు. సెలవులు వచ్చాయంటే చాలు ఇంట్లో వారందరికీ కొద్దిగా విరామం లభిస్తుంది. హమ్మయ్య. . కాస్త తీరిక దొరికిందనే భావన వచ్చేస్తుంది. కుటుంబ సంక్షేమం.. వికాసం.. ఆనందం గురించి ఆలోచించేవారు కొద్దిగా బయటకు వెళ్లి రావాలని భావిస్తున్నారు. ఇటీవల చాలా కుటుంబాలు ఆహ్లాద ప్రదేశాలకు వెళ్లి వస్తున్నాయి. జిల్లా నుంచి మొదలుకుంటే విదేశాల వరకు పర్యటిస్తున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు ఎలాంటి ప్రదేశాలకు వెళ్తున్నారో 'న్యూస్‌టుడే' కథనం.

ఆధ్యాత్మిక, పర్యాటక..

■ ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇష్టమైన దైవ దర్శనాలు చేస్తే కనీసం పుణ్యంతోపాటు మనసు కుదుట పడుతుందని భావిస్తున్నారు.

■ ఒత్తిడికి దూరంగా, ప్రకృతి రమణీయ ప్రాంతాలకు వెళ్తున్నారు. మన వద్ద ఆహ్లాదకర ప్రదేశాలు తక్కువే. రెండ్రోజులు గడిపే విధంగా అనువైన ప్రాంతాలు లేవు. నాగార్జునసాగర్, పాపికొండలు, విశాఖపట్నం, అరకు, తమిళనాడు, కేరళలాంటి ప్రాంతాలను చుట్టేస్తున్నారు.

■ బడ్జెట్, సమయం చూసుకొని తిరుపతితోపాటు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. తీర్థయాత్రలకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వారణాసి, అయోధ్య ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయని తెలుసుకొని చాలామంది అక్కడికీ వెళ్తున్నారు.


■ మరికొందరు విదేశాలకు వెళ్తున్నారు. ఎక్కువ మంది సింగపూర్, మలేషియా, శ్రీలంక, దుబాయ్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మిత్రులతో కొందరు, కుటుంబీకులతో మరికొందరు వెళ్తున్నారు.

పర్యాటక వాహనాలకూ డిమాండ్

■ ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలను, ఇతర జిల్లాలోని జలపాతాలను ఒక రోజులో చుట్టేసి వస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారే కాకుండా.. అద్దె వాహనాలు తీసుకొని వెళ్లి వీటి అందాలు చూసి వస్తున్నారు.



■ మరికొందరు కార్డిల్లా క్రూజ్ టూకు ఇష్టపడుతున్నారు. సముద్రంలో ఓడలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముంబయి నుంచి గోవాకు, గోవా నుంచి చెన్నై, చెన్నై నుంచి శ్రీలంకకు వెళ్లేందుకు పర్యాటక ప్యాకేజీలున్నాయని ఒక ట్రావెల్ ఏజెన్సీకి చెందిన కుర్ర శ్రీకాంత్ తెలిపారు.



మరచిపోలేని మలేషియా పర్యటన

ఇటీవల మిత్రులతో కలిసి మలేషియా పర్యటనకు వెళ్లాం. మలేషియా నుంచి విమానంలో గంట ప్రయాణం చేస్తే లంకావి అనే ప్రాంతం వస్తుంది. ఇక్కడ సముద్రంలో అరగంట ప్రయాణించిన తర్వాత సూర్యాస్తమయం దగ్గరి నుంచి చూసే అవకాశముంది. ప్రపంచంలోని చాలామంది పర్యాటకులు దీనిని చూసేందుకు వస్తుంటారు. స్కై బ్రిడ్జి కారు, సముద్రంలో లోపల ఉన్న మ్యూజియంలో రకరకాల చేపలు చూసి ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడి బాటు కేవ్స్‌లో మన హిందూ దేవాలయాలు ఉంటాయి. సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం చూడదగినది. ట్విన్ టవర్స్ ప్రాంతంలో ఎంజాయ్ చేశాం. ఈ పర్యటన జీవితాంతం గుర్తుండటమే కాకుండా మంచి అనుభూతి కల్గించింది.



మలేషియా ట్విన్ టవర్స్ వద్ద శ్రీపాల్‌రెడ్డి

వీరి ప్రదర్శన చూస్తే.. ఔరా అనాల్సిందే!

న్యూస్‌టుడే, జ్యోతినగర్, మార్కండేయ కాలనీ

అకాడ శిక్షణలో అబ్బుర పరుస్తున్న చిన్నారులు

కనుమరుగవుతున్నాయి అనుకుంటున్న ప్రాచీన యుద్ధ కళలు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. కర్రసాము, కత్తిసాములతో సాహస విన్యాసాలు చేస్తూ యుద్ధ విద్యను నేర్చుకుంటున్నారు ఈ చిన్నారులు. దసరా సందర్భంగా ఎన్టీపీసీకి చెందిన కంది రాజయ్య జ్ఞాపకార్థంగా అతని కుమారుడు శ్రీహనుమాన్ అకాడ శిక్షకులు కంది నాగరాజు ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ఉచితంగా స్థానిక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణిస్తున్నారు. ఈ కేంద్రానికి చిన్నారులు తరలివచ్చి శిక్షణ పొందుతున్నారు.

పలు అంశాల్లో..

అకాడలో శిక్షణ నేర్చుకుంటున్న బాల, బాలికలకు కత్తి, కర్రసాము, తలపై కొబ్బరికాయ పగలగొట్టడం, కడుపుపై అరటిపండు కత్తితో కోయడంతోపాటు ఇతర విన్యాసాలు శిక్షణలో భాగం. దీంతో ఒక్కరికి ఆత్మస్థైర్యం పెరగడంతోపాటు ముఖ్యంగా ఏకాగ్రత పెరుగుతోంది. ఆత్మ రక్షణ పొందే పలు అంశాలపై పట్టు లభిస్తుంది. ప్రతి విజయదశమి సందర్భంగా చిన్నారులకు విన్యాసాలు నేర్పడంతోపాటు ఉత్సవాల్లో ప్రతిభను ప్రదర్శిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.



చిన్నారులకు కత్తి, కర్రసాము శిక్షణ ఇస్తున్న కోచ్ నాగరాజు

యుద్ధ విద్య అవసరం.. - హారిణి, విద్యార్థిని



యుద్ధ విద్య నేర్చుకుంటే ఎటువంటి ఆపద నుంచి అయినా బయటపడవచ్చు. దేశంలో సంస్కృతి, సంప్రదాయాల కోసం గిరిపుల్లో భాగంగా ఆనవాయితీగా వస్తున్న కళలను ప్రోత్సహించడంతోపాటు యుద్ధ విద్య ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ విద్య ముఖ్యంగా అమ్మాయిలకు అవసరం.

ప్రాచీన కళను వెలికితీయాలని.. - కంది నాగరాజు, అకాడ శిక్షకులు

ఆంగ్లేయుల కాలంలో జమీందారులు ఈ విద్యను ప్రోత్సహించేవారు. విజయనగర సామ్రాజ్యంలో సంస్థాన సామంతరాజులు కత్తి, కర్రసాములను ఔత్సాహిక ప్రదర్శనలు చేసేవారు. యుద్ధ విద్యతో ప్రతి ఒక్కరికి మరింత నైపుణ్యం, గెలుపు, ఆత్మవిశ్వాసం, శరీర ఆకృతి, ఆత్మరక్షణ పెరుగుతుంది. ప్రాచీన యుద్ధ విద్యను పలువురికి నేర్పి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే నా లక్ష్యం.

కర్రసాముపై ఆసక్తి.. - నిస్సీ, విద్యార్థిని



చిన్నప్పటి నుంచి కర్రసాము అంటే ఇష్టం. సాధారణంగా చదువుతోపాటు కర్ర, కత్తిసాము ప్రదర్శనలు చూస్తుంటే నాతో సాధ్యమవుతుందా అనే ఆలోచన వచ్చేది. నా ఆసక్తిని గుణంగా ఉచితంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకునే దిశగా అకాడలో చేరాను. ప్రస్తుతం కర్ర, కత్తిసాము సాధన చేస్తున్నా. ఏదైనా నేర్చుకోవాలన్న తపన, సాధన చేస్తే తప్పని సరిగా విజయం సాధిస్తాం.

గీత కార్మికులందరికీ రక్షక కవచాలు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని దాదాపు 2 లక్షల మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్-రామగుండం బైపాస్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గీత కార్మికులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కాటమయ్య రక్షక కిట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 వేల కిట్లు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో వెయ్యి మంది గీత కార్మికులకు కిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. హైదరాబాద్ ఐఐటీ వారు ఈ కిట్టు నాణ్యతను ధ్రువీకరించారన్నారు. జారి పడిపోకుండా జాకెట్ రక్షిస్తుందని, ఓ గీత కార్మికుడు మంత్రి, కలెక్టర్ సమక్షంలో ప్రదర్శించి చూపించారు.

నాలుగు పాఠశాలలకు శంకుస్థాపన..: రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని ప్రారంభిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్, వర్ధన్నపేట, మానకొండూరు, మంథనిలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' పాఠశాలల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న వసతిగృహాలను, గురుకులాలను జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులు సందర్శించాలన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, అబ్కారీ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, బీసీ సంక్షేమాధికారి అనిల్ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ ఐలేందర్, గౌడ సంఘ నాయకులు ఆదర్శ సత్యనారాయణ గౌడ్, తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.



గీత కార్మికుడికి కాటమయ్య రక్షక కవచాన్ని అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం



సుబ్బరాజు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో హోంగార్డు దుర్మరణం చెందిన ఘటన మెట్‌పల్లి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన ఓంకారం సుబ్బరాజు(43) జగిత్యాల గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం పట్టణ శివారులోని హోటల్ నుంచి అల్పాహారం తీసుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆర్మూర్ వైపు నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న నిజామాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బరాజు తల పైనుంచి బస్సు వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సుబ్బరాజుకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. సీఐ, హోంగార్డు ఆర్ఎస్సై సుమన్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఎస్సారెస్పీ స్పిల్‌వే గేట్ల మూసివేత

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11,590 క్యూసెక్కులకు తగ్గటంతో స్పిల్‌వేగేట్లను మూసివేశారు. ఎస్కేప్‌గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా వరదకాలువకు నీటివిడుదలను 2 వేల క్యూసెక్కులకు తగ్గించారు. కాకతీయ తదితర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ అవసరాలు కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 11,590 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.

రెండు బ్యాచ్‌లు.. 48 మందికి కొలువులు

డీఎస్సీలో సత్తాచాటిన కరీంనగర్ డైట్ విద్యార్థులు

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేసిన ఒకే బ్యాచ్‌కు చెందిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికై ప్రత్యేకత చాటుకున్నారు. 2015-17 బ్యాచ్ అభ్యర్థులు 28 మంది (25 మంది ఎస్జీటీలుగా, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లుగా) కొలువులు సాధించారు. ఆ బ్యాచ్‌లో వంద మంది ఉండగా, ఈ ఏడాది జరిగిన డీఎస్సీకి హాజరైన ఆ బ్యాచ్‌లోని 28 మంది తమ కలను నిజం చేసుకున్నారు. వీరిలో ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల వారు ఉన్నారు. ఇదే కళాశాలలో చదివిన 2014-16 బ్యాచ్ విద్యార్థులు 20 మంది ఉద్యోగాలు సాధించారు. వివిధ జిల్లాలకు చెందిన వీరు మంగళవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలను అందుకున్న సందర్భంగా కలుసుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఇదే కళాశాలలో చదివిన మరో బ్యాచ్ అభ్యర్థిని హనుమకొండ జిల్లాలో ఎస్జీటీ టాపర్‌గా, మరో అభ్యర్థిని కరీంనగర్ జిల్లా టాపర్‌గా నిలవడం గమనార్హం. అధ్యాపకుల బోధన, వారి ప్రోత్సాహం ఉద్యోగాల సాధనకు ఉపయోగపడిందని పలువురు తెలిపారు. ఉద్యోగాలు సాధించినవారిని డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మొండయ్య, అధ్యాపకులు డాక్టర్ శంకర్, సి.హెచ్.ప్రద్యుమ్నకుమార్, మహేశ్వర్‌రెడ్డి, మంజుల తదితరులు అభినందించారు.



ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 2015-17 డీఎడ్ బ్యాచ్ అభ్యర్థులు



2014-16 డీఎడ్ బ్యాచ్ అభ్యర్థులు

అన్నా చెల్లెళ్లకు ఒకేసారి..



సుస్మిత, సురేష్

ముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని కేశనపల్లికి చెందిన అన్నాచెల్లెలు ఒకేసారి ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కేశనపల్లికి చెందిన కోళ్ల రాధ-కొమురయ్యలకు ముగ్గురు సంతానం. వీరు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో చిన్న కొడుకు సురేష్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో, కూతురు సుస్మిత ఎస్‌జీటీలో రెండో ర్యాంక్ పొందారు. ప్రస్తుతం సురేష్ జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గురుకులంలో విధులు నిర్వహిస్తున్నాడు.

శ్రమించారు.. కలిసి కొలువు సాధించారు



సతీశ్, మౌనిక దంపతులు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు గుంటుకు సతీశ్, గజ్జెల్లి మౌనికలు డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. వీరికి 2019లో వివాహం జరిగింది. ఒక పాప ఉంది. సతీశ్ ఓ చిట్‌ఫండ్స్ కంపెనీలో పని చేసేవాడు. 2017లో డీఎస్సీ రాసినప్పటికీ రాలేదు. మౌనిక ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసేది. ఇద్దరూ ఉద్యోగాలకు రాజీనామా చేసి రెండు సంవత్సరాల పాటు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇందుకు ఆర్థికంగా ఇరువురి కుటుంబ సభ్యులు సహాయపడ్డారు. పాపను సతీశ్ లేదా మౌనిక తల్లిదండ్రులు చూసుకునేవారని, అందువల్లే తాము పూర్తిగా చదువుపై శ్రద్ధ పెట్టగలిగామని చెబుతున్నారు. సిరిసిల్లలోని సినారె గ్రంథాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టి లక్ష్యాన్ని సాధించారు. గ్రంథాలయం వద్ద అన్నపూర్ణ క్యాంటీన్‌లో అందించే రూ.5 భోజనం తింటూ చదువుకున్నారు. వీరి స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి పాఠ్యాంశాలపై ఎప్పటికప్పుడు చర్చించుకునేవారు. ఇది బాగా ఉపయోగపడిందని చెప్పారు. పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని చెబుతున్నారు ఈ దంపతులు.

కష్టాలకు ఎదురొడ్డి.. లక్ష్యాన్ని చేరుకొని



స్వప్న

కరీంనగర్ కలెక్టరేట్, కొత్తపల్లి, న్యూస్‌టుడే: చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది ఆ యువతి. తండ్రి చిన్నప్పుడే చనిపోగా.. తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అయినా మొక్కవోని ధైర్యంతో లక్ష్యం వైపు అడుగులేసి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి తన కలను సాకారం చేసుకొంది కరీంనగర్ శివారు కొత్తపల్లికి చెందిన స్వప్న. దూస శారద-లక్ష్మీరాజం దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వారిలో చిన్న కూతురు స్వప్న. అక్కలిద్దరవి పెళ్లిలు కాగా.. వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. స్వప్న చిన్నప్పటి నుంచి సర్కారు బడుల్లోనే చదువుకుంది. అక్కడ పాఠాలు బోధించే ఉపాధ్యాయులను చూసి, ఆ ఉద్యోగం సాధించాలని ఆశయంగా పెట్టుకుంది. తండ్రి చిన్నప్పుడే మరణించగా.. తల్లి బీడీలు చుడుతూ చదివించింది. స్వప్న ఇంటి వద్ద ట్యూషన్లు చెప్పేది. డీఎస్సీ నోటిఫికేషన్ అనంతరం తల్లి సైతం మరణించింది. ఓ వైపు దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షకు సిద్ధమైంది. ఇటీవల విడుదలైన ఎస్‌జీటీ ఫలితాల్లో 18వ ర్యాంకు సాధించింది. బుధవారం హైదరాబాద్‌లో ఉద్యోగ నియామక పత్రం అందుకుంది.

కూలీ నుంచి ఉపాధ్యాయుడిగా..



నిరుపేద కుటుంబం.. ఉండటానికి సరైన గూడు లేదు.. పనిచేస్తేనే పూట గడిచే పరిస్థితి.. ఓ వైపు కూలీ పనికి వెళ్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామానికి చెందిన పాశం శంకర్-గంగు దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు. వీరి కుమారుడు ప్రశాంత్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. 6 నుంచి 12 వరకు మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివాడు. టీటీసీలో సీటు రాగా సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లిలో 2017-19లో పూర్తిచేశాడు. తండ్రి శంకర్ కూలీ పనులకు వెళ్తుండగా తల్లి అనారోగ్యంతో ఇంటికే పరిమితమైంది. తండ్రి కూలీ పనులకు వెళ్తేనే పూటగడిచేది. దీంతో ప్రశాంత్ పెయింటింగ్‌తో పాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. ఉదయం కూలీ పనికి వెళ్తూ రాత్రిళ్లు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీగా ఎంపికయ్యాడు. బుధవారం ఉపాధ్యాయ నియామక పత్రం అందుకోగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషంలో మునిగిపోయారు. – న్యూస్‌టుడే, కోరుట్ల

మట్టిలో మాణిక్యాలు



వేణుగోపాల్



ప్రశాంత్

శంకరపట్నం : కేశవపట్నం గ్రామానికి చెందిన హమాలీ, కూలీల బిడ్డలు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన జూల వెంకటలక్ష్మి-శ్రీనివాస్ దంపతుల కుమారుడు వేణుగోపాల్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, కరీంనగర్‌లో డిగ్రీ, బీఎడ్ చేశారు. తండ్రి శ్రీనివాస్ హమాలీ కార్మికుడు కాగా.. తల్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కొడుకు వేణుగోపాల్‌ను చదివించారు. వేణుగోపాల్ సైతం సోదరుడితో కలిసి ఖాళీ సమయాల్లో వేడుక మందిరాల్లో డెకరేషన్‌గా కూలీ పనులు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. కూలీ పనులు చేస్తూ ఓ పక్క ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమించారు. ఇంటి వద్దనే ఉండి డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యారు. డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదటి సారి 2017లో డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపిక కాలేదనే నిరుత్సాహం అతడిలో ధైర్యం నింపింది. రెండో ప్రయత్నంలో వేణుగోపాల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసి చదివించిన కష్టానికి ఫలితం దక్కిందని వేణుగోపాల్ పేర్కొన్నారు.

■ కేశవపట్నం గ్రామానికి చెందిన గొడిశాల ప్రశాంత్ తండ్రి తిరుపతి రైసుమిల్లులో కూలీ కాగా, తల్లి మాలతి రోజువారీ కూలీగా పని చేసేవారు. తాము పడ్డ కష్టం తమ కుమారుడు పడొద్దని బాగా చదవమనేవారు. ప్రశాంత్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ విద్యాభ్యాసం చేశారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివిన ప్రశాంత్ టీటీసీ, బీఎడ్ పూర్తి చేశారు. డీఎస్సీ ఫలితాల్లో 72.27 మార్కులతో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

పండగపూట స్తంభంపల్లిలో విషాదం

తేనెటీగల దాడిలో రైతు మృతి ■ మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



లచ్చిరెడ్డి

బోయినపల్లి, న్యూస్‌టుడే: పంట పొలాల వద్ద పనులు చేసుకుంటున్న రైతులపై తేనెటీగలు దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కందాడి లచ్చిరెడ్డి (60), అతని కొడుకు నవీన్ రెడ్డి, మరో ఇద్దరు రైతులు రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డిలు తమ వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. సమీపంలోని చెట్టుపై కొమ్మ విరిగి తేనెటీగలపై పడటంతో ఒక్కసారిగా లేచాయి. పొలంలో పనులు చేసుకుంటున్న లచ్చిరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డిలపై దాడి చేశాయి. వాటి నుంచి కాపాడుకోవడానికి పరుగు తీసి మంట పెట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. లచ్చిరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తీవ్రంగా గాయపడటంతో వేములవాడలోని ఓ ఆసుపత్రికి తరలించారు. లచ్చిరెడ్డిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పండగ రోజు రైతు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై పృథ్వీధర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లచ్చిరెడ్డికి భార్య వినోద, కొడుకు నవీన్‌రెడ్డి, కూతురు రజిత ఉన్నారు.

యువకుడి దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణమా?



వినయ్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని యైటింక్లయిన్ కాలనీ హనుమాన్‌నగర్‌లో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్(25) స్కావెంజర్‌గా విధులు నిర్వహించేవాడు. ఖనికి చెందిన ఓ వివాహితతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆమె భర్త, పిల్లలను వదిలి మూడు నెలలుగా వినయ్‌కుమార్‌తో కలిసి ఉంటోంది. గురువారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు.. ఆయుధాలతో వినయ్‌కుమార్‌పై దాడిచేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తన కుమారుడిని వివాహిత సోదరుడు, భర్త కలిసి హత్య చేశారని మృతుడి తండ్రి కుమారస్వామి పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ రమేష్ పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

మూలమలుపు.. ప్రమాదానికి పిలుపు



పాలకుర్తి మండలం రాఘాపూర్ నుండి కన్నాల వైపు వెళ్లే గ్రామ శివారు సమీప మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద చెట్ల పొదలు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కనిపించడం లేదు. వాహనాలు తప్పించే క్రమంలో పలు ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని - **న్యూస్‌టుడే, పాలకుర్తి**

నేర వార్తలు

పాముకాటుకు రైతు బలి



ఆశయ్య

ధర్మారం, న్యూస్‌టుడే: గడ్డి వాము నుంచి కట్ట తీస్తుండగా పాము కాటేయడంతో రైతు మృతి చెందిన ఘటన ధర్మారం మండలం పత్తిపాకలో పండగపూట విషాదం నింపింది. ధర్మారం ఎస్సై లక్ష్మణ్ కథనం మేరకు పత్తిపాకకు చెందిన చెన్నూరి ఆశయ్య(54)ను ఈ నెల 8న పొలం వద్ద ఉన్న గడ్డివాము నుంచి కట్టను తీస్తుండగా పాము రెండు సార్లు కాటేసింది. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆశయ్య కొడుకు అఖిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఇంటికి రంగు వేస్తూ కింద పడి కూలీ మృత్యువాత

ఓదెల: ఇంటికి రంగు వేస్తుండగా వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఘటన ఓదెల మండలం కొలనూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన మ్యాక రవీందర్(37) పెయింటర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం కొలనూర్ గ్రామంలో ఓ ఇంటికి రంగు వేస్తుండగా తాడు తెగి ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో జడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి



రవీందర్‌గౌడ్

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండల తొలి జడ్పీటీసీ సభ్యుడు కొక్కిస రవీందర్‌గౌడ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్ 1995లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. మండల అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందారు. ఇటీవల అనారోగ్యానికి గురై కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రవీందర్‌గౌడ్ అంత్యక్రియలు స్వగ్రామమైన గంగారంలో నిర్వహించారు. మృతునికి భార్య రమ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షిప్తం

దసరా ఏర్పాట్లను పరిశీలించిన జీఎం

గోదావరిఖని: సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవ ఏర్పాట్లను జీఎం లలిత్‌కుమార్ గురువారం పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రావణ వధకు, ప్రజలు కూర్చునేందుకు గ్యాలరీలు, విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తున్నారు. ఏసీపీ రమేశ్, సీఐ ఇంద్రసేనారెడ్డి, అధికారులు తదితరులున్నారు.

దుర్గామాత ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు

కమాన్‌పూర్: దుర్గామాత నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోదావరిఖని రెండో పట్టణ సీఐ ఎన్.ప్రసాదరావు అన్నారు. కమాన్‌పూర్ ఠాణాలో గురువారం దుర్గామాత నిర్వాహక కమిటీ సభ్యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. దుర్గామాత ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా శివయ్య

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా అటవీ అధికారి శివయ్య ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలోని బ్రాహ్మణపల్లిలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను, అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఎంపీడీవో అలీం, ఎంపీవో వేణుమాధవ్, రమ్యతేజ, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ హోంగార్డును సన్మానిస్తున్న సీపీ శ్రీనివాస్

హోంగార్డుకు సీపీ సన్మానం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు మున్వర్ అహ్మద్‌ను రామగుండం సీపీ శ్రీనివాస్ సన్మానించారు. మంచిర్యాల సబ్ యూనిట్‌లో హోంగార్డుగా పనిచేసిన మున్వర్.. గురువారం ఉద్యోగ విరమణ పొందడంతో శాలువాతో సత్కరించారు. అదనపు డీసీపీ రాజు, ఏసీపీ రామచంద్రరావు, ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐ దామోదర్ తదితరులున్నారు.

సింహ వాహనంపై నారసింహుడి ఊరేగింపు

ధర్మపురి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సింహ వాహనంపై స్వామివారిని వీధుల్లో ఊరేగించారు. దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



పుర వీధుల్లో నారసింహుడి సేవ

బతుకమ్మా.. వెళ్లి రావమ్మా!



ఖని : రాజలక్ష్మి కాలనీలో



కాల్వశ్రీరాంపూర్: ఊషన్నపల్లిలో..



ఖని: యువతి ఉత్సాహం



ఖనిలో యువతి..



గోదావరిఖనిలో

జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలు ఎక్కడ చూసిన బతుకమ్మ సందడే కనిపించింది. తొమ్మిది రోజుల వేడుకల్లో చివరి రోజైనా సద్దుల బతుకమ్మను మహిళలు ఎంతో వైభవంగా నిర్వహించుకున్నారు. పొద్దున లేచి రంగురంగుల పూవ్వులతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం ప్రధాన కూడళ్లలో.. ఆలయాల్లో బతుకమ్మ చుట్టూ ఆడి పాడారు. మహిళలు పాటలు పాడుతూ.. దానికి అనుగుణంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడారు. యువతులు కోలాటాలతో సందడి చేశారు.

– న్యూస్‌టుడే, బృందం



బతుకమ్మతో ఆర్జీ-I జీఎం, ఎమ్మెల్యే దంపతులు



ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో..



ఖని : దుర్గానగర్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కమాన్‌పూర్ : గుండారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఓదెల : హరిపురంలో బతుకమ్మలు ఎత్తుకొస్తున్న నాయకులు



పెద్దపల్లి : హనుమంతుని పేటలో..



సుల్తానాబాద్‌లో..



ధర్మారంలో యువతి



పెద్దపల్లిలో బతుకమ్మ



మంథని గాంధీచౌక్‌లో..



అంతర్గాం మండలం మద్దిర్యాలలో..

కోర్టు ప్లీడర్‌గా పొత్కపల్లి వాసి



వేణుగోపాల్ గౌడ్

ఓదెల, న్యూస్‌టుడే: మండలంలోని పొత్కపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి వేణుగోపాల్‌గౌడ్‌ను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. వేణుగోపాల్‌గౌడ్ నియామకం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మావోయిస్టు నేత తల్లికి పరామర్శ



వీరమ్మకు సరుకులు అందజేసిన ఏసీపీ కృష్ణ

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: మండలంలోని కిష్టంపేటకు చెందిన మావోయిస్టు నేత కంకనాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్ తల్లి వీరమ్మను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ గురువారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా చీరెతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. వీరమ్మకు ఎల్లప్పుడు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమించి.. ఉపాధ్యాయ కొలువు సాధించి



భర్త, పాపతో రజిని

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: అరమార్కుతో 2009లో ఉపాధ్యాయ ఉద్యోగావకాశం కోల్పోయిన పట్టువదలకుండా ఈసారి అదే ఉద్యోగాన్ని పొందారు సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి చెందిన పూసాల రజిని. తల్లిదండ్రులు, భర్త శ్రీనివాస్ ప్రోత్సాహంతో రజిని పీజీ, బీఎడ్ పూర్తిచేసి 2009లో డీఎస్సీ పరీక్ష రాసి 0.5మార్కులతో ఉద్యోగం కోల్పోయారు. ఓ వైపు వెల్గటూర్‌లోని కేజీబీవీలో ఒప్పంద ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే డీఎస్సీకి సొంతగా సన్నద్ధం అయి ఇటీవల విడుదలైనా ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(జీవశాస్త్రం) విభాగంలో 78.4 మార్కులతో జిల్లా 11వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. జిల్లాలో బీసీ-ఏ కేటగిరీలో ఉన్న ఒక్క ఉద్యోగం రజిని సాధించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

ముత్తారం : ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని ముత్తారం ఎస్సై గోపతి నరేష్ అన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడడుగుల బతుకమ్మ



సుల్తానాబాద్ యాదవనగర్‌లో ఏడు అడుగుల బతుకమ్మతో బండ మాధవి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ సందర్భంగా గురువారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో ఏడడుగుల బతుకమ్మలు ప్రత్యేకార్షణగా నిలిచాయి. సుల్తానాబాద్‌లోని యాదవనగర్‌కు చెందిన మహిళ బండ మాధవి ఏడడుగుల బతుకమ్మను పేర్చింది. ప్రతి సంవత్సరం మాధవి ఈ విధంగానే బతుకమ్మను అలంకరిస్తుంది. సుల్తానాబాద్ మండంలోని గర్రెపల్లిలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అనూష ఏడున్నర అడుగుల బతుకమ్మను తయారుచేశారు.


ఘనంగా గోపాల కాలువలు



నృత్యం చేస్తున్న యువతులు

మంథని, న్యూస్‌టుడే: స్థానిక మహాలక్ష్మి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంథని పట్టణ పురవీధుల గుండా దేవి ఉత్సవ విగ్రహం ఊరేగింపుతో గోపాలకాలువలను గురువారం ఘనంగా నిర్వహించారు. దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా నిర్వహించిన గోపాలకాలువల్లో భజనలతో పాటు మహిళల, యువతుల కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. తమ్మిచెరువుకట్ట వీధిలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టె కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బతుకమ్మ పాట విడుదల



సీడీని ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ పాటను సీఎండీ బలరాం గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆవిష్కరించారు. సింగరేణి ఉద్యోగి, కవి జయరాజ్ రాసిన బతుకమ్మ గీతాన్ని విడుదల చేశారు. అనంతరం జయరాజ్‌ను సీఎండీ అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుధ పూజ

గోదావరిఖని పట్టణం: స్థానిక గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్‌లో గురువారం ఆయుధపూజ నిర్వహించారు. శస్త్ర చికిత్సలకు ఉపయోగించే ఆయుధాలకు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ హిమబిందుసింగ్‌తోపాటు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధ పూజలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

కొనసాగుతున్న నవరాత్రులు

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. 8వ రోజు అయినా గురువారం అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించారు. మంథని పట్టణంలో మహాంకాళి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి భక్తులను ఆకట్టుకుంటుంది. అమ్మవారికి ఇరువైపులా శివుడు, విష్ణుమూర్తి, సరస్వతి, పార్వతీ దేవి, శిరస్సుపై ఆది శేషువు దర్శనమిస్తున్నారు.



మంథనిలో దుర్గామాత



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం సుధాకరరావు

నేడు అవగాహన కార్యక్రమం



కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించినందుకు శుక్రవారం నిర్వహించే అవగాహన కార్యక్రమంపై ఆర్జీ-3 జీఎం సుధాకరరావు సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష జరిపారు. ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి భోజనాల ఏర్పాట్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జీఎం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఏరియా రక్షణాధికారి రాజశేఖర్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులకు సంస్థ లక్ష్యాలపై..

యైటింక్లయిన్‌కాలనీ: 'ఉజ్వల సింగరేణిలో ఉద్యోగుల పాత్ర' అనే అంశంపై గురువారం ఆర్జీ-2 డివిజన్‌లోని వకీలుపల్లెగని ఆవరణలో ఉద్యోగులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎం సూర్యనారాయణ పాల్గొని బొగ్గు ఉత్పత్తి, లక్ష్యాలు, కార్మికుల రక్షణ చర్యలు, బొగ్గు రవాణా, యాజమాన్యం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానం

యైటింక్లయిన్‌కాలనీ: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆర్జీ-2 డివిజన్‌లోని ఓసీపీ-3 ప్రాజెక్టు ఆవరణలోని అమ్మవారి ఆలయం వద్ద కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్మికులు, అధికారులు, యూనియన్ నాయకులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

సింగరేణిలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో జీఎం దంపతులు సుధాకరరావు-అలివేణి, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు-విజయలక్ష్మి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల ఆధ్వర్యంలో గురువారం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ సంబరాలు, ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెంటినరీకాలనీలోని కార్మిక కుటుంబ మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను మైదానంలో పెట్టి ఆడిపాడారు. ఆర్జీ-3 జీఎం సుధాకరరావు-అలివేణి, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు-విజయలక్ష్మి హాజరయ్యారు. ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి 10 మందికి వెండి నాణాలను బహుమతిగా అందించారు.



బతుకమ్మ ఆడుతున్న అధికారులు, ఉద్యోగులు, కార్మికులు